

నృసింహునికి మొక్కులు
ధర్మపురి : శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం లో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ పాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.



సీతారాములకు ప్రత్యేక పూజలు
వేములవాడ: రాజన్న సన్నిధిలో సీతారాముల కల్యాణోత్సవంలో భాగంగా బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు.

గరిష్ఠం/కనిష్ఠం
38.0/24.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. పగటిపూట ఎండగా ఉంటుంది.

అర్థరహితమైన మాటలకన్నా అర్థవంతమైన నిశ్శబ్దం చాలా గొప్పది.
- మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
గురు 6:33	శుక్ర 4:46

రంజాన్ వేళలు

పల్లె మెరిసింది!

- జిల్లాలో 27 పంచాయతీలకు జాతీయ పురస్కారాలు
- మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా అందుకున్న ప్రజాప్రతినిధులు
- తొమ్మిది అంశాల్లో పల్లెలకు పురస్కారాలు

సిరిసిల్ల: జిల్లాలోని పల్లెల్లో అభివృద్ధి పనులు, సంక్షేమ ఫలాలు పల్లవిస్తున్నాయి. జాతీయస్థాయిలో జిల్లాలోని పల్లెలు అవార్డులు సాధిస్తూ.. ఆదర్శంగా నిలుస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ సతత్ వికాస్ పురస్కారాలను తొమ్మిది అంశాల్లో పరిశీలించి అందిస్తోంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 255 గ్రామపంచాయతీలు ఉండగా.. 27 గ్రామాలను వివిధ విభాగాల్లో ఉత్తమ పంచాయతీలుగా ఎంపిక చేయగా... ఆయా పల్లెల పాలకులు గత సోమవారం రాష్ట్ర మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా జిల్లా కలెక్టరేట్‌లో అవార్డులు అందుకున్నారు.


జోగాపూర్ గ్రామం

జిల్లాలో ఎంపికైన గ్రామాలు ఇవే
చందుర్తి మండలం మూడపల్లి, జోగాపూర్, ఇల్లంతకుంట మండలం వంతడ్పుల, జంగంరెడ్డిపల్లె, గంభీరావుపేట, కోళ్లమద్ది, సముద్రలింగాపూర్, కోనరావుపేట మండలం నాగారం, మర్తనపేట, ఎగ్లాస్‌పూర్, ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి, రామలక్ష్మణపల్లె, నామాపూర్, మద్దికుంట, మోహినికుంట, తంగళ్లపల్లి మండలంలో కస్బెకట్కూర్, చీర్లవంచ, రామన్నపల్లె, వీర్నపల్లి మండలంలోని బాబాయి చెరువుతండా, మద్దిమల్ల తండా, అడవి పదిర, వన్‌పల్లి, ఎల్లారెడ్డిపేట మండలంలోని రాజన్నపేట, అక్కపల్లి, ఎల్లారెడ్డిపేట, పదిర గ్రామాలు ఉత్తమ పంచాయతీలుగా వివిధ విభాగాల్లో ఎంపిక అయ్యాయి. చందుర్తి మండలం మూడపల్లి మాత్రం రెండు విభాగాల్లో అవార్డులు పొందడం విశేషం.


'వీరు ముస్తాబాద్ మండలం మోహినికుంట పంచాయతీ పాలకవర్గం. ఇక్కడ ప్రజాప్రతినిధులు అందరూ మహిళలే. ఈ ఊరు మహిళా స్నేహపూర్వక అవార్డును సాధించింది. ఏడాది క్రితం జాతీయస్థాయిలో చైల్డ్‌ఫ్రెండ్లీ గ్రామపంచాయతీగా అవార్డును దక్కించుకున్న మోహినికుంట నేడు ఉత్తమ మహిళా పంచాయతీగా అవార్డును గెలుచుకుంది. మహిళా పాలకులు గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచారు. మహిళా భవనం, గోదాం, ఊరంతా సీసీరోడ్లు వేశారు. 65మంది పేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇచ్చారు. దళితులకు మూడెకరాల భూమి ఇప్పించడం వంటి అన్ని ప్రభుత్వ పథకాలు ఈ ఊరిలో అమలయ్యాయి.


'ఇది గంభీరావుపేటలోని కేజీ టూ పీజీ ప్రాంగణం. రాష్ట్రంలోనే తొలిసారి ఏర్పాటు చేసిన స్కూల్ ప్రాంగణం ఇది. పలకతో స్కూల్‌కు వచ్చి పట్టాతో బయటికి వెళ్లేలా ఇక్కడ విద్యావృద్ధిని చేశారు. పారిశుధ్యం, పచ్చదనం, హరితహారం, అవెన్యూప్లాంటేషన్, ఆసరా పెన్షన్లు, ఇంటింటికి మంచినీరు అందించడంలో గంభీరావుపేట ముందుంది. గ్రామపంచాయతీ పాలకవర్గం అందరి సహకారంలో ముందుకు సాగడంతో స్వయం సమృద్ధి వసతులతో ఉత్తమ పంచాయతీగా ఎంపికైంది.'


'చిరునవ్వు చిందిస్తున్న ఈ వృద్ధులది కోనరావుపేట మండలం మర్తనపేట. అర్హులైనవారికి ఆసరా పెన్షన్లు అందించడంలో ఈ ఊరు ముందుంది. మర్తనపేటలో 84 మందికి వృద్ధాప్య పింఛన్లు, 27మందికి వికలాంగుల పింఛన్లు, 52 మందికి వింతంతు, నలుగురికి గీతకార్మికుల పింఛన్లు, ఏడుగురికి ఒంటరి మహిళ పింఛన్లు, 102 మందికి బీడీకార్మికుల పింఛన్లు కలిపి మొత్తం 276 మందికి పింఛన్లు అందుతున్నాయి. అభివృద్ధి పనుల్లో ముందుండడంతో ఆదర్శపల్లెగా గుర్తింపు సాధించింది.

వసతులు సాధించాం

సిపాయిని కాదు.. సపాయిని అన్న మాటలను ఆచరణలో పెట్టాను. స్వయం సమృద్ధ వసతులు సాధించాం. అందరి సహకారంతో ఈ విభాగంలో అవార్డు రావడం ఆనందంగా ఉంది. అన్ని రంగాల్లో గంభీరావుపేటను నంబర్ వన్ స్థానంలో ఉంచుతా. కేజీ టూ పీజీ కాంప్లెక్స్ దేశానికి ఆదర్శంగా నిలిచింది.
– కటుకం శ్రీధర్ పంతులు, సర్పంచ్, గంభీరావుపేట

మహిళా సాధికారత దిశగా

మహిళా సాధికారతను సాధించాం. మా ఊరిలో సర్పంచ్‌తో పాటు, వార్డు సభ్యులు కూడా మహిళలనే ఎన్నుకున్నాం. మహిళా అధికారులే మా ఊరికి వచ్చారు. మంత్రి కేటీఆర్ సహకారంతో మోహినికుంటలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం. మహిళా స్నేహ పూర్వక అవార్డు రావడం ఆనందంగా ఉంది.
– కల్వకుంట్ల వనజ, సర్పంచ్, మోహినికుంట

స్వచ్ఛతను సాధించుకున్నాం

గ్రామాన్ని పచ్చదనం పరిశుభ్రతతో ఉంచాలన్న లక్ష్యానికి గ్రామస్తుల సహకారం లభించింది. వ్యక్తిగత పరిశుభ్రత కోసం ఇంటికో మరుగుదొడ్డిని నిర్మించుకున్నారు. మురికి నీరు వీధుల్లో కనిపించకుండా ఇంకుడు గుంతలను నిర్మించాం. పచ్చదనం కోసం మొక్కలను నాటాం. అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో సాధించాం. అవార్డు రావడం ఆనందంగా ఉంది.
– కవిత, పంచాయతీ కార్యదర్శి, జోగాపూర్

న్యూస్‌రీల్


పిల్లలపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని మండెపల్లి గ్రామంలో బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ, పిల్లలపై తల్లిదండ్రులు ఎక్కువ శ్రద్ధ వహించాలని, తద్వారా బాలలపై జరిగే అకృత్యాలను అరికట్టవచ్చని తెలిపారు. పేదలకు న్యాయం అందించేందుకు న్యాయసేవాధికార సంస్థలను ఏర్పాటు చేశారని, తెల్లకాగితంపై రాసి దరఖాస్తు చేసుకుంటే చాలు న్యాయం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గనప శివజ్యోతి, ఎంపీటీసీ బుస్స స్వప్న, ఉప సర్పంచ్ రాములు, లోక్ అదాలత్ సభ్యుడు చింతోజు భాస్కర్, ఎస్సై లక్ష్మారెడ్డి, న్యాయవాదులు బూర్ల కళ్యాణి, ఆడెపు వేణు, కుంట శ్రీనివాస్, పెంట శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి
సిరిసిల్లఅర్బన్: విద్యార్థులు ఇష్టపడి చదవినప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈవో హాజరై మాట్లాడారు. 10వ తరగతి పరీక్షల్లో ప్రతి విద్యార్థి 10జీపీఏ సాధించాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కల్లూరి రాజు, ఎస్ఎంసీ చైర్మన్ కమలాకర్, ప్రధానోపాధ్యాయులు పోలాస మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దు
సిరిసిల్లఅర్బన్: ఉపాధి నిమిత్తం ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లేందుకు నకిలీ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని ఎస్పీ అఖిల్ మహాజన్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ అనుమతులు ఉన్న ఏజెన్సీలను సంప్రదించి ఉపాధి అవకాశాలు పొందాలన్నారు. నకిలీ ఏజెంట్ల వల్ల అనేక మంది అమాయకులు మోసపోతున్నారని, నకిలీ ఏజెంట్లను అరికట్టేందుకు పోలీస్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి ప్రజలను మోసం చేసే ఏజెన్సీల లైసెన్స్ రద్దు చేసి క్రిమినల్, పీడీయాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గల్ఫ్ ఏజెంట్ల చేతిలో మోసపోయిన బాధితులు, నకిలీ ఏజెంట్ల సమాచారం తెలిస్తే స్పెషల్ బ్రాంచ్ సీఐ కరుణాకర్ 87126 56411 నంబర్‌లో సంప్రదించాలన్నారు. సమాచారం అందించిన వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

విద్యార్థులకు రక్షణ కల్పించాలని వినతి

వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

సిరిసిల్లటౌన్: వార్షిక పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ప్రయాణంలో రక్షణ కల్పించేలా అన్ని శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్కం నాగరాజు కోరారు. ఈమేరకు బుధవారం జిల్లా విద్యాధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. వారం క్రితం ఓవర్‌లోడ్‌గా విద్యార్థులతో వెళ్తున్న ఆటో ప్రమాదానికి గురైందన్నారు. ఇటువంటి ఘటనలు జరక్కుండా చూడాలన్నారు. ఇలాంటి ఘటనలకు బాధ్యులుగా సదరు కళాశాలలు, పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అంజేసినవారిలో నాయకులు రాజు, ప్రవీణ్, మధు, సందీప్, వేణు తదితరులు ఉన్నారు.

నేడు రాజన్న సన్నిధిలో రామయ్య పెళ్లి

- భారీగా తరలివస్తున్న శివపార్వతులు
- కిక్కిరిసిన రాజన్న ఆలయం
- మున్సిపల్ పక్షాన పట్టువస్త్రాలు
- కల్యాణ వేడుకలకు అన్ని ఏర్పాట్లు


విద్యుత్ దీపాల వెలుగుల్లో రాజన్న ఆలయం

వేములవాడ: రాజన్న సన్నిధిలో గురువారం ఉదయం 11.55 గంటలకు శ్రీసీతారాముల కల్యాణోత్సవం జరిపేందుకు ఆలయ అధికారులు సర్వం సిద్ధం చేశారు. బుధవారం మధ్యాహ్నం నుంచే వేలాదిగా శివపార్వతులు వేములవాడకు చేరుకుంటున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. శివపార్వతుల పూనకాలు, హిజ్రాల నృత్యాలతో వేములవాడ పట్టణం సందడిగా మారింది. కల్యాణోత్సవాన్ని భక్తులు తిలకించేందుకు వీలుగా, ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు ఆలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు షామియానాలు వేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చైర్మన్ చాంబర్ వద్ద ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై స్వామివారల కల్యాణోత్సవం జరగనుంది. ఇందుకు రూ.16 లక్షలతో భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఈ రాజేశ్ తెలిపారు. 2 లక్షల లీటర్ల తాగునీటి పాకెట్లు అందుబాటులో ఉంచారు. దాతల సాయంతో 5 వేల లీటర్ల మజ్జిగను భక్తులకు అందజేయనున్నారు. 11 చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆటోల ద్వారా తాగునీరు సరఫరా చేయనున్నారు. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు కూలర్లు, స్వామివారలను భక్తులు దర్శించుకునేందుకు ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రసాదాల పంపిణీకి ప్రత్యేక చర్యలు చేపట్టారు. గురువారం సాయంత్రం స్వామివారి రథోత్సవం కన్నులపండుగా జరగనుంది. డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

మున్సిపల్ పక్షాన పట్టువస్త్రాలు

ఆలయంలో జరిగే సీతారాముల కల్యాణానికి స్థానిక మున్సిపల్ పాలకవర్గం పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేస్తారు. గురువారం ఉదయం 8 గంటలకు చైర్‌పర్సన్ మాధవి, కౌన్సిలర్లు, అధికారుల ఆధ్వర్యంలో అందజేయనున్నట్లు కమిషనర్ అన్సారీ తెలిపారు.

వేములవాడలో వింతైన తంతు

రామన్న పెళ్లి రోజున రాజన్నతో వివాహమాడటం ఇక్కడో వింతైనతంతు. శ్రీరామనవమి రోజు సీతారాముల కల్యాణం మామూలే. కానీ ఈ గుడిలో రాజన్నను భర్తగా భావించి శివపార్వతులు, జోగినులు, హిజ్రాలు, కల్యాణమాడుతారు. బాల్యం నుంచే శివపార్వతులుగా మారుతున్న బాలికలు సైతం ఉన్నారనడంలో అతిశయోక్తి లేదు. అయితే తాము అనారోగ్యం బారిన పడటంతో శివపార్వతీగా మారుతానని మొక్కుకున్నామని, ఆరోగ్యం బాగుపడిందని, అందుకే శివపార్వతీగా మారామని పలువురు చెబుతున్నారు.

శివపార్వతులకు సర్వం సిద్ధం

కల్యాణోత్సవంలో పాల్గొనే శివపార్వతులకు శివుడిని పెళ్లి చేసుకునేందుకు అవసరమైన వస్తువులను అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వేదికపై సీతారాముల కల్యాణోత్సవం జరుగుతుంటే.. లింగభేదం లేకుండా కాళ్లకు రాగి మెట్టెలు, చేతులకు రాగి వస్తువులు, చేతిలో త్రిశూలం పట్టుకుని, నెత్తిన జీలకర్ర పెట్టుకుని, బాసింగాలు కట్టుకుని, మెడలో రుద్రాక్ష వేసుకున్న శివపార్వతులు శివుడిని పెళ్లాడటం ఈ క్షేత్రంలో ఆనవాయితీగా వస్తోంది. కాగా శివపార్వతుల కోసం ఆలయ ప్రాంతం, జాతరాగ్రౌండ్ తదితర ప్రాంతాల్లో రాగి వస్తువులు, రుద్రాక్ష, త్రిశూలం, లింగాలు, గంటలు, బాసింగాలు అమ్మేందుకు అన్ని సిద్ధంగా ఉంచారు. కాగా భక్తుల రద్దీ దృష్ట్యా బుధవారం రాత్రంతా స్వామివారి దర్శనానికి అవకాశం కల్పించారు.


కోనేరులో భక్తుల సందడి


రాజన్న చెంతకు తరలివస్తున్న భక్తులు


ఆలయ ఆవరణలో భక్తులు

కల్యాణోత్సవానికి భారీ బందోబస్తు

వేములవాడ: రాజన్న క్షేత్రంలో గురువారం సీతారాముల కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా జరుపుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం రాత్రి కల్యాణోత్సవ ఏర్పాట్లు, ధర్మగుండం, క్యూలైన్లు, ప్రధానాలయం, ఆలయ పరిసరాలు, పార్కింగ్ స్థలం, భక్తులు విడిది చేసే ప్రాంతాలను ఈవో కృష్ణప్రసాద్, డీఎస్పీ నాగేంద్రచారితో కలిసి పరిశీలించారు. ఇందుకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 200 మంది పోలీసులను ఉత్సవాల ఏర్పాట్లకు ఉపయోగిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా 100 నంబర్‌కు కాల్ చేసి చెప్పాలన్నారు. ఎస్పీ వెంట చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై వెంకట్రాజం, ఆలయ అధికారులు ఉన్నారు.


కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు


మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో పదో తరగతి పరీక్షలకు ఏ ఒక్క పొరపాటు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో బుధవారం విద్యాశాఖ అధికారులు, పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్, సిట్టింగ్ స్క్వాడ్ అధికారులతో సమీక్షించారు. ఏప్రిల్ 3 నుంచి 13 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వివరించారు. జిల్లాలో 36 కేంద్రాల్లో 6,496 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని, ఇందులో 3,400 మంది బాలురు, 3096 మంది బాలికలు ఉన్నారని వివరించారు. కేంద్రాల్లో మంచినీటి వసతి వంటి మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించరని, సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రశ్నాపత్రాలు కేంద్రాలకు తెచ్చేటప్పుడు, జవాబు పత్రాలను తరలించేటప్పుడు పోలీసుల రక్షణ విధిగా ఉంచాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, డీఈవో రమేశ్, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ అజీమ్, ఎంఈవోలు దూస రఘుపతి, బి.బన్నాజీ తదితరులు పాల్గొన్నారు. ఇదే అంశంపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, విద్యాశాఖ కమిషనర్ వాకాటి కరుణ, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ శ్రీదేవసేనలు వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై వారు సమీక్షించారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.


సీపీఆర్‌పై అవగాహన ఉండాలి..

గుండెపోటు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అందరికీ అవగాహన ఉండాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి వైద్య సేవలు

సాక్షి ఎఫెక్ట్

వేములవాడ: రాజన్న భక్తులకు వైద్యం అందించే ప్రథమ చికిత్స కేంద్రం ఎట్టకేలకు తెరుచుకుంది. రాజేశ్వరపురం వసతి గదుల్లో భక్తుల కోసం ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స కేంద్రం మూతబడటంతో ఇటీవల 'సాక్షి' 'భక్తులకందని వైద్యం' శీర్షికన కథనం ప్రచురించింది. దీంతో జిల్లా వైద్యశాఖ బుధవారం రాజేశ్వరపురంలో ప్రథమ చికిత్స కేంద్రాన్ని ప్రారంభించింది. ఇంతేకాకుండా గురువారం జరిగే సీతా రాముల కల్యాణోత్సవానికి సుమారు 2లక్షల మంది వచ్చే అవకాశాలుండటంతో పాటు ఎండలు కాస్త తీవ్రతరం కావడంతో భక్తులకు మరిన్ని వైద్య సేవలు అందుబాటులో ఉంచుతున్నట్లు డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు తెలిపారు. జాతరాగ్రౌండ్‌లో బస్తీ దవాఖానా, ఆలయ పరిసరాల్లో అంబులెన్స్‌లు సైతం అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.



రాజేశ్వరపురంలో తెరుచుకున్న ప్రథమ చికిత్స కేంద్రం

క్లుప్తంగా

గిఫ్ట్ ఏ స్మైల్ ట్యాబ్‌లు పంపిణీ



విద్యార్థినులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న సెస్ చైర్మన్, ఎంపీపీ, జెడ్పీటీసీ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో విద్యార్థినులకు బుధవారం గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, ఎంపీపీ పడిగెల మానస, జెడ్పీటీసీ పూర్మాని మంజుల ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థినులు చక్కగా చదివి గొప్పగా ఎదగాలన్నారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించి కన్నవారికి, కళాశాలకు గొప్పపేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సిలివేరి ప్రసూన, వైస్ ఎంపీపీ జంగిటి అంజయ్య, ప్రిన్సిపాల్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ యూత్ వినూత్న నిరసన



బండి సంజయ్ ఫొటోకు తంబాకుతో అభిషేకం చేస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: మంత్రి కేటీఆర్‌పై బండి సంజయ్ చేస్తున్న ఆరోపణలు, విమర్శలపై సిరిసిల్లలో బీఆర్‌ఎస్ యూత్ వింగ్ వినూత్న తరహాలో నిరసన తెలిపింది. బీఆర్‌ఎస్ యూత్ వింగ్ అధ్యక్షుడు సుంకపాక మనోజ్ నేతృత్వంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ఎంపీ సంజయ్ ఫొటోకు తంబాకుతో అభిషేకం నిర్వహించి మాట్లాడారు. తలా తోక లేకుండా బండి సంజయ్ వ్యాఖ్యలు ఉంటున్నాయని పేర్కొన్నారు. మంత్రి కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమన్నారు. జిల్లాలోని బీజేపీ నాయకుల తీరుపై విమర్శలు చేశారు. కార్యక్రమంలో కత్తెర వరుణ్, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజారోహణం



ధ్వజారోహణ పూజలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని నారాయణపూర్ గ్రామంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ధ్వజారోహణం, హోమం, కలశస్థాపన, అభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం దేవత ఆహ్వానం, అగ్ని ప్రతిష్ఠ చేసి హోమం కాల్చి సంప్రోక్షన చేశారు. గురువారం నిర్వహించే గరుడవాహన ఊరేగింపునకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో వేద పండితులు శ్రీనివాస్‌శర్మ, గోపాల్‌చారి, సర్పంచ్ నిమ్మ లక్ష్మి, ఎంపీటీసీ అపెరా సుల్తానా, ఉపసర్పంచ్ మహేందర్, ఆలయ కమిటీ చైర్మన్‌లు సూర నర్సయ్య, లింగాల అంజయ్య, మాజీ సర్పంచ్ దొమ్మాటి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



టాటా.. బైబై

ఇంటర్‌మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలు బుధవారంతో ముగిశాయి. సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష సెంటర్ నుంచి విద్యార్థులు సంతోషంగా బయటకు వస్తూ పరస్పరం వీడ్కోలు చెప్పుకున్నారు. చిన్న బోనాల, పలు రెసిడెన్షియల్ హాస్టళ్లలో ఉన్న విద్యార్థులు ముల్లె మూట సర్దుకుని ఇంటిబాట పట్టారు. స్నేహితులకు వీడ్కోలు చెప్పి సెలవు తీసుకున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల









స్మార్ట్ పట్టణ కీర్తి మహిళల చలవే

- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్లటౌన్: స్వచ్ఛతలో జాతీయ కీర్తి సాధిస్తూ.. స్మార్ట్ సిరిసిల్ల అవతరణలో మహిళలే కీలకపాత్ర వహించారని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. స్వచ్ఛోత్సవ్–2023లో భాగంగా బుధవారం స్థానిక పంచాయితీరాజ్ అతిథి గృహం నుంచి సినారె ఆడిటోరియం వరకు నిర్వహించిన స్వచ్ఛ మషాల్ మార్చ్ సందర్భంగా ఆమె మాట్లాడారు. మున్సిపల్ చేపడుతున్న ప్రతీ పనిలో మహిళల భాగస్వామ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. ఈక్రమంలోనే వారికి ఉపాధి అవకాశాలు కల్పించామని, స్వచ్ఛతలో భాగంగా తడి, పొడి, హానికర చెత్తను వేర్వేరుగా మున్సిపల్ సిబ్బందికి అందించడం, సెప్టిక్ ట్యాంకుల నిర్మాణంలో వారికి వందశాతం అవగాహన కల్పించామన్నారు.



మున్సిపల్ ఆధ్వర్యంలో స్వచ్ఛ మషాల్ మార్చ్

మున్సిపల్ ద్వారా ఉపాధి అందుకున్న మహిళల్లో ప్రతిభ కనబరిచిన వారిని కేంద్ర ప్రభుత్వం అందించే స్వచ్ఛ ఉమెన్ అవార్డులకు పంపిస్తామన్నారు. వందలాది సంఖ్యలో మహిళలు పాల్గొనగా..ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య, కౌన్సిలర్లు, ఆర్పీలు, మెప్మా సీఈవోలు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ నుంచి ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల: జిల్లాలోని రేషన్ కార్డుదారులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించే లక్ష్యంతో ఏప్రిల్ నుంచి ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేయనున్నట్లు అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం పౌరసరాఫరాల అధికారులతో కలిసి ఆయన ఫోర్టిఫైడ్ బియ్యంపై రూపొందించిన పోస్టర్, బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, పోషకాలైన ఐరన్, ఫోలిక్ ఆసిడ్, విటమిన్ బీ–12, నిర్ధారిత మోతాదులో ఆ బియ్యంలో కలపబడి ఉంటాయన్నారు. వీటిని తినడం మూలంగా బలవర్ధకమైన ఆహారం, పోషకాలు లభిస్తాయని వివరించారు. రక్తహీనత, అలసట తగ్గిపోయి, చలాకీతనం ఉంటుందన్నారు. నాడీ వ్యవస్థ బాగుపడుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని రేషన్‌కార్డుదారులు ఈ బియ్యంపై



పోస్టర్ ఆవిష్కరించిన అదనపు కలెక్టర్ తదితరులు

అపోహలకు గురి కావద్దని, అందరూ తినాలని అదనపు కలెక్టర్ కోరారు. బియ్యం రంగు, రుచి, వాసన ఏమీ తేడా ఉండదని, శాఖాహార వనరుల నుంచి ఉత్పత్తి చేయబడిన ఫోర్టిఫైడ్ బియ్యం సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో ఎస్.జితేందర్‌రెడ్డి, డెప్యూటీ తహసీల్దార్ నవీన్‌కుమార్, జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు రెడ్డిమల్ల హన్మాండ్లు, మండల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

మమ్మల్ని చూసుకునే కొడుకును తీసుకెళ్తివా దేవుడా..!

- విద్యుదాఘాతంతో యువకుడు మృతి
- కుమారుడి మరణంతో మిన్నంటిన తల్లిదండ్రుల రోదనలు
- ఎన్గల్ గ్రామంలో విషాదం



రవి(ఫైల్)

చందుర్తి(వేములవాడ): 'రెక్కల కష్టాన్ని నమ్ముకుని మమ్మల్ని చూసుకునే కొడుకును తీసుకెళ్తివా దేవుడా' అంటూ ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. 'ఏ పాపం చేశాడని తీసుకుపోయావు.. మమ్మల్ని దిక్కులేనోళ్లను చేశావు'.. అంటూ ఆ దంపతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తుంటే.. అక్కడున్న వారికి వారి రోదనను ఆపతరం కాలేదు. రెక్కల కష్టంతో కుటుంబాన్ని పోషించే చెట్టంతా కొడుకు కరెంట్‌షాక్‌తో మృతిచెందాడన్న వార్త వినడంతో ఆ తల్లిదండ్రులు ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. పోలీసులు,



రవి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి, బంధువులు

గ్రామస్తుల కథనం ప్రకారం..

చందుర్తి మండలం ఎన్గల్ గ్రామానికి చెందిన పసుల రవి(28) ఎలక్ట్రీషియన్ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. బుధవారం అదే గ్రామంలో ఈకల రాములు అనే రైతు ఇంట్లో విద్యుత్ వైరింగ్ పనులు చేసేందుకు వెళ్లాడు. పనులు చేస్తున్న క్రమంలో రవికి విద్యుత్‌షాక్ తగిలి కిందపడిపోయాడు. రాములు భార్య లచ్చవ్వ ఇంటి ముందు పని ముగించుకుని ఇంట్లోకి వెళ్లే సరికి రవి అచేతన స్థితిలో కిందపడిపోయి కనిపించాడు. దీంతో భయపడిన ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. విద్యుదాఘాతంతో రవి ఛాతిపై, చేతి వేళ్లు కమిలిపోయి ఉన్నాయి. వెంటనే పోలీసులకు గ్రామస్తులు సమాచారమిచ్చారు. ఎస్సై రమేశ్ తన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తమ్ముడి రాక కోసం ఆగిన అంత్యక్రియలు

ఎన్గల్ గ్రామానికి చెందిన పసుల వెంకటమ్మ–స్వామి దంపతులకు ఇద్దరు కొడుకులు. పెద్ద కుమారుడు రవి గ్రామంలో ఎలక్ట్రీషియన్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుండగా, చిన్న కుమారుడు సమర్పణ్ జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు. రోజులాగే ఎలక్ట్రీషియన్ పని చేసేందుకు వెళ్లిన రవి మరణించాడన్న వార్తతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. దుబాయ్‌లో ఉన్న రవి తమ్ముడు వచ్చిన తర్వాత అంత్యక్రియలు జరగనున్నాయి. దీంతో బంధువులు, కుటుంబ సభ్యులు సమర్పణ్ రాక కోసం ఎదురుచూస్తున్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మోదీ

- ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు

సిరిసిల్లటౌన్: కేంద్రంలో అప్రజాస్వామిక పాలన నెరుపుతున్న బీజేపీకి దమ్ముంటే వెంటనే ఎన్నికలకు సిద్ధమై తన ప్రజాబలం ఏంటో రుజువు చేసుకోవాలని కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన దీక్షలో పాల్గొని మాట్లాడారు. ప్రజల్లో కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణ చూసి మోదీ సర్కారు కుట్రపూరిత రాజకీయాలు జరుపుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని మోదీ ఖూనీ చేస్తున్నారని, రాహుల్‌గాంధీని పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేయడం అప్రజాస్వామికమన్నారు. దేశంలో సర్వమతాలను ఏకం చేస్తూ



నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు

పాలించే కాంగ్రెస్ పార్టీపై బీజేపీ విద్వేషపూరితంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. కేంద్ర సర్కారు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక చర్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని లేకుంటే మరింత ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీసెల్ అధ్యక్షుడు కూస రవీందర్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు సాహెబ్, మధుకర్, నక్క నర్సయ్య, హరికృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో పనుల పరిశీలన

చందుర్తి(వేములవాడ): మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో చేపట్టిన పనులను అడిషనల్ డీఆర్‌డీఏ చీకోటి మదన్‌మోహన్ బుధవారం పరిశీలించారు. విద్యార్థులకు శుద్ధజలం అందించేందుకు ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌కు రెండు నెలల క్రితం కలెక్టర్ నిధుల నుంచి రూ.2.50లక్షలు మంజూరు చేశారు. అలాగే సోలార్ హీటర్లకు సంబంధించిన సోలార్ ప్యానల్స్ పగిలిపోగా, వాటి మరమ్మతుకు రూ.95 వేలు మంజూరు చేశారు. కాగా మంజూరైన నిధులతో విద్యాలయంలో చేపట్టిన పనులను అడిషనల్ డీఆర్‌డీఏ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అడిషనల్ డీఆర్‌డీఏ వెంట ఎంపీడీఓ పత్తి రవీందర్, కస్తూరిబా గాంధీ విద్యాలయ ప్రత్యేకాధికారి కల్పన తదితరులు ఉన్నారు.



వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

తమిళనాడులో తెలంగాణ డోలోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులు

వేములవాడరూరల్: తెలంగాణ కళారంగం అంటేనే ప్రపంచ దేశాలకు ఆకట్టుకునేలా ఉంటోంది. చండీశ్వర ఒగ్గు కళా సేవా సమితి ఆధ్వర్యంలో వేములవాడ రూరల్ మండలం నమి లిగుండుపల్లి గ్రామానికి చెందిన ఒగ్గు డోలు కళాకారులు తమిళనాడులోని తంజావూరు విశ్వవిద్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొని తన కళానైపుణ్యాన్ని ప్రదర్శించారు. పలువురు ఉన్నతాధికారుల మన్ననలు అందుకున్నారు. కార్యక్రమంలో ఎగుర్ల మహేష్, రాము, మొగ్గయ్య, గణేష్, ప్రశాంత్, సుమన్, రాజు, అంజి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తలు పాటించాలి

ముస్తాబాద్(సిరిసిల్ల): ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని జరిగే సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని సిరిసిల్ల రూరల్ సీఐ బి.ఉపేందర్ అన్నారు. బుధవారం మండలంలోని గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంటర్‌నెట్, స్మార్ట్ ఫోన్లు ఉపయోగించే వారు అపరిచితుల నుంచి వచ్చే మెస్సెజ్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. అలాగే వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌లలో ఫొటోలు, వీడియోలను అప్‌లోడ్ చేయవద్దని, మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడే ముఠాలు ఉన్నాయన్నారు. భద్రతతో కూడిన ఆన్‌లైన్ బ్యాంకింగ్ పనులు చేసుకోవాలన్నారు. ఎస్సై వెంకటేశ్వర్లు, సర్పంచ్ సరిత, ఉపసర్పంచ్ శాడ శ్రీనివాస్, ఎంపీటీసీ శ్రీధర్, హెచ్‌ఎం చేరాల ప్రభాకర్, ఎస్‌ఎంసీ చైర్మన్ రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సైబర్ భద్రత అంబాసిడర్స్‌కు బ్యాడ్జీలు అందజేస్తున్న సీఐ

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని లక్ష్యంతో ముందుకెళ్తూ ఉన్నతస్థాయికి ఎదగాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మండలంలోని దుమాల గిరిజన గురుకులం బాలికల ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గివ్ తెలంగాణ ఆధ్వర్యంలో గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా 48 మందికి ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్కార్ బడులను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తుందన్నారు. విద్యార్థుల ఉన్నత విద్యకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకొని కష్టపడి చదవలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి రేణుక, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, నాయకులు కొండ రమేష్‌గౌడ్, కిషన్, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.



విద్యార్థులతో ఆగయ్య, నాయకులు

మహిళ ఆత్మహత్యాయత్నం

- చిట్టీ డబ్బులు మోసపోయానని మనస్తాపం

కథలాపూర్(వేములవాడ):ప్రతినెలా చిట్టీ డబ్బులు చెల్లించినా.. గడువు ముగిసిన తర్వాత తిరిగి ఇవ్వలేదు. తాను మోసపోయానని భావించిన ఓ మహిళ క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఈ సంఘటన అంబారిపేటలో బుధవారం జరిగింది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. అంబారిపేటలో ఓ మహిళ కొన్ని సంవత్సరాలుగా పలువురి వద్ద ప్రతినెలా డబ్బులు వసూలు చేసి చిట్టీ నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఇప్పపెల్లి గ్రామానికి చెందిన అతికెం స్వప్న.. అంబారిపేటలోని ఆ మహిళ వద్ద ప్రతినెలా చిట్టీ డబ్బులు చెల్లిస్తూ వస్తోంది. అయితే, చిట్టీ గడువు ముగిసినా.. డబ్బులు తిరిగి ఇవ్వడంలేదు. విసిగిపోయిన అతికెం స్వప్న అంబారిపేటలోని సదరు మహిళ ఇంటికి బుధవారం వెళ్లి తనకు డబ్బు ఇవ్వాలని నిలదీసింది. తనకు రావాల్సిన రూ.3.50 లక్షలు ఇవ్వాలని పట్టుబట్టింది. తాను ఆ సొమ్ము ఇవ్వనని సదరు చిట్టీ నిర్వాహకురాలు తేల్చిచెప్పి బెదిరించింది. తాను చిట్టీ పేరిట రూ.3.50 లక్షలు చెల్లించి మోసపోయాయని, ఇంట్లోవారికి తెలిస్తే ఎలా అని మనస్తాపానికి గురైన స్వప్న.. క్రిమిసంహారక మందు తాగింది. స్థానికులు గమనించి కోరుట్లలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాధితురాలు స్వప్నను ఏఎస్సై ఎండీ ఆలీమొద్దీన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

జగదాంబ ఆలయంలో చోరీ



జగదాంబ ఆలయం

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని జైసేవాలాల్ భుక్యారెడ్డి తండా సమీపంలో గల జగదాంబ ఆలయంలో బుధవారం తెల్లవారుజామున దొంగతనం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం ..ఆలయం తాళాలు పగులగొట్టిన దొంగలు గర్భగుడిని తెరిచి అమ్మవారి పుస్తెలతాడు, ముక్కుపుడక, నగలు, బట్టలు ఇతర వస్తువులు ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించారు. అయితే గత కొన్ని రోజులుగా అమ్మవారి గర్భగుడికి తాళం వేయడంలేదని తెలిసింది. వేములవాడ–సిరికొండ ప్రధాన రహదారి పక్కనే ఉన్నా దొంగతనం జరగడంతో ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

వరదకాలువలో దూకి వృద్ధుడి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం(కోరుట్ల):స్థానిక వరదకాలువలో దూకి సంగెపు మోహన్ (60) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఉమాసాగర్ బుధవారం తెలిపారు. ఆయన కథనం.. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ప్రాంతానికి చెందిన సంగెపు మోహన్.. ఏడాదినుంచి పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఆర్మూర్‌లోని ఆయుర్వేద క్లినిక్‌కు వెళ్లి మసాజ్ చేసుకుని వస్తానని కుటుంబసభ్యులకు చెప్పి మంగళవారం ఉదయం ఇంట్లోంచి బయటకు వచ్చాడు. ఈక్రమంలో మెట్‌పల్లి మండలం రాజరాజేశ్వర్‌రావుపేట వరదకాలువలో దూకి చనిపోయాడు. ఎర్రాపూర్ గ్రామశివారులో మృతదేహం లభ్యం కావడంతో కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. పెద్ద కొడుకు నరేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

3,276 మందికి కంటి పరీక్షలు

సిరిసిల్ల: జిల్లాలో కంటి వెలుగులో 3,276 మందికి బుధవారం కంటి పరీక్షలు నిర్వహించారు. జిల్లాలోని 23 ప్రాంతాల్లో కంటి వైద్యపరీక్షలు జరిగాయి. ఇందులో 207 మంది సిబ్బంది పాల్గొన్నారు. 3,276 మందిలో 461 మందికి రీడింగ్ అద్దాలు, 449 మందికి పాయింట్ కంటి అద్దాలను అందించారు. జిల్లాలో 46 రోజులుగా 1,72,659 మందికి కంటి వైద్యపరీక్షలు చేశారు.

రైతులకు పంటనష్ట పరిహారం అందించాలి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

సిరిసిల్లటౌన్: పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ముందు పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి మాట్లాడారు. రైతులు అప్పు చేసి పంటను పండిస్తే అకాల వర్షాలతో కుదేలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరానికి రూ. 50వేలు పరిహారం అందించాలని, వచ్చే సీజన్లో పంటలు వేయడానికి విత్తనాలు, ఎరువులు పూర్తి సబ్సిడీతో అందించాలన్నారు. మామిడి తోటలకు ఎకరానికి రూ.30 వేలు ఇవ్వాలని, కౌలు రైతులను ఆదుకోవాలన్నారు. వ్యవసాయ రుణాలు మాఫీ చేయాలని లేకుంటే రైతుల పక్షాన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని అందించారు. నాయకులు కడారి రాములు, మంచికట్ల రమేష్, పంతం రవి, మీసం లక్ష్మన్, జాన్సన్, మల్లేశం, అంజన్న, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.